# అవకాశవాదులు

## శింగంపల్లి అప్పారావు

ఒకనాడు నక్కబావ, పిల్లినత్తములూ, పిచ్చాపాటీ మాట్లాడుకుంటూ మందగమనంతో బయలుదేరారు. చివరకు ఏ విషయం మీదా చర్చ కుదరక నీతి వేదాంత శాస్త్రాల్లోనికి దిగారు!

నక్కబావ యిలా అంది: "సృష్టిలో జీవరాసులన్నీ సమామే! హెచ్చు తగ్గుల్లేవు! భేదభావాల్లేవు! ఒక జీవిని యింకొక జీవి హింసించడం సృష్టికర్త మెచ్చడు. బలవంతులు బలహీనుల్ని తమ ఎరగా చేసుకోవడం నీచాతినీచం! అసలు మనం మాంసాహారులమైనా, శాకాహారాలు తిని బ్రతగ్గలం! నీచం...మలినం... అయిన యీ కుళ్లు మాంసాహారం కన్నా కందమూలాదులెన్నో రెట్లు ఘనమైనవి. అందుచేతనే యీ రోజునుంచి, మాంసాహారం, విసర్జించదలచుకున్నాను. ఎప్పుడైతే మాంసం విసర్జించామో, జీవహింస చేసే అవసరం కలుగదు. అప్పుడే మనకు భగవంతుడు సన్నిహితుడౌతాడు!"

నక్కబావ చెప్పిన విషయాల్ని అర్థంచేసుకున్న దానిలా తల ఆడిస్తూ "అయితే బావగారూ! దేవుడంత భక్తసులభుడా! జీవహింస చేయనంత మాత్రాన మనకు ముక్తిని ప్రసాదిస్తాడా!" అన్నది పిల్లి.

"సందేహమేముంది! జీవుల్ని హింసించకుండా, భగవధ్యానం గురిగా పెట్టుకొని, ప్రాణరక్షణకు, కందమూలాదులు తింటూవుంటే, నిజంగానే దేవుడు దర్శనమిస్తాడు!" అన్నది నక్కబావ!

"అలాగైతే నేనుకూడ యీనాటినుంచి మాంసంవర్జిస్తాను!" అన్నది పిల్లి.

"ఇది మన మిద్దరమే ఆచరిస్తే చాలదు. నలుగురకూ బోధించాలి. జీవహింస మహాపాపమన్న సంగతి, దేశం నలుమూలలా, వ్యాపింపచేయాలి! అప్పుడు మనకు ఎంతో కీర్తివస్తుంది!" అన్నది నక్క!

ఇద్దరూ అలా మాట్లాడుకుంటూ, చాలాదూరం నడిచి వచ్చేశారు. ఇంతలో ఎదురుగా వున్న చిట్టడవిలో నుంచి, తోడేలుగారు వూడిపడ్డారు!

"అదుగో తోడేలు బావ! ఎక్కడికో జోరుగా పోతున్నాడు!" అన్నది పిల్లి.

నక్క వెంటనే అటువైపు చూసి "ఏమండోయ్, బావగారూ! మాట మాట!" అని పిలిచింది.

కాని తోడేలు వినిపించుకోకుండా, నిర్లక్ష్యంగా గబగబా ముందుకు సాగిపోయింది!

ఆ ప్రాంతాల్లోనే ఒక చోట చిన్న గొఱ్ఱెల మంద వున్నది. గొఱ్ఱెల కాపరి చెట్టునీడన నిద్రపోతున్నాడు. తోడేలు చడీచప్పుడు లేకుండా వెళ్లి, ఒకగొఱ్ఱెపిల్ల కంఠం పుచ్చుకొని, చంపివేసింది! తరువాత దాన్ని నోట కరుచుకొని వెనక్కి వచ్చిన దారినే పరుగుతీసింది!

వస్తున్న తోడేలుకు నక్కబావ, పిల్లి నత్తములు, తారసపడ్డారు!

తోడేలు నోటిలోవున్న గొఱ్ఱెపిల్లను చూసి నక్కబావ ఎంతగానో విచారించింది.

"అయ్యో!......ఎంత దారుణ క్రూరకృత్యం!...జీవహింస, మహాపాపం కదోయ్! నీ ప్రాణరక్షణకోసం, దాన్ని బలిచేయడం ఏమి గొప్పతనం! -నీచమైన ఆ మాంసం లేకపోతే చచ్చిపోతావా! కందమూలాదులు తిని బ్రతకవచ్చునే!" అన్నది నక్క తోడేలుకు నీతి బోధిస్తూ!

నక్క అన్న మాటలకు, బిగ్గరగా నవ్వింది తోడేలు.

"నక్కబావగారు యీ ఉపన్యాసా లెప్పటినుంచి మొదలు పెట్టారు! భేష్!—బాగానే వుంది! మీరీనాడు, ఏ జంతువు మాంసం భోంచేసి యిలా బయలుదేరారు! పాపం నక్కయ్యగారికి తిక్కెక్కినట్టుంది!" అన్నది తోడేలు హేళనగా.

"ఛాల్చాల్లే! నోర్ముయ్! నక్క



"పలుకరాదటే చిలుకా!"

—ఫొటో: జి. ఎస్. శర్మ.

## ★ అవకాశవాదులు ★

బావగారినంటే కళ్లు పోతాయ్! ఆయన కందమూలఫలాలు తప్పిస్తే మాంసాహారం భుజింపరు! తెలుసా!" అన్నది మార్జాలం!

"అలాగా! ఓరి పిచ్చినాయనమ్మలూ, మీ వేదాంతాలు నీతిశాస్త్రాలూ, అలా కట్టిపెట్టండి! ఆకలిగా ఉన్నప్పుడు ఆహారం సంపాదించుకోవడంలో, తప్పేముంది? కందమూలాలు, కష్టపడి పనిచేయలేక, ముక్కుమూసుకొని, మూలకూర్చునే మునిరాయుళ్ళకుగాని, మనకెందుకూ? అసలు సంగతేమిటంటే,- సృష్టిలో కొన్ని జీవరాసుల్ని, విధాత, మన ఆహారంకోసమే సృష్టించాడు! అందుకూ మాంసాహారం కన్పించినపుడు తినడం పుట్టుకు మానను! అది నావల్ల అయ్యే పనిగాదు! మీరు మాంసాహారం మానేస్తే నాకేమీ అభ్యంతరం లేదు. ఎక్కడైనా మాబోటిగాళ్లకు శాస్త్ర ఆహారమైనా చిక్కుతుంది!" అంటూ తోడేలు చిట్టడవిలోనికి పారిపోయింది!

నక్క, పిల్లి, ఆశ్చర్యపోతూ, తోడేలు వెళ్ళినవైపే చూస్తూ, ఒక్క క్షణం స్తబ్ధంగా వుండిపోయాయి.

'ఎంత భయానక దృశ్యం! నెత్తురు ఓడుతున్న ఆ గొర్రెపిల్లను చూడగానే, నిజంగా నాకేడుపొచ్చింది!" అన్నది పిల్లి కన్నీళ్లు కారుస్తూ!

నక్క ముఖంలో గాంభీర్యం

తెచ్చుకొని "మూర్ఖులు! - మంచిని గ్రహించలేరు! ఇలాంటి పరమ కిరాతులు, సద్గతిని ఎలా పొందుతారు! ఎవరి కర్మ వారిది!" అన్నది వేదాంతిలా!

"పోనిద్దురూ! మన విధి మనం నెరవేర్చాం! వినకపోతే నరకానికే పోతారు!" అన్నది పిల్లి.

మళ్లా యిద్దరూ నడకసాగించారు! చివరకు ఒక మిల్లువద్దకు చేరుకున్నారు. అక్కడ కొన్ని కోళ్ళు నేలమీద పడివున్న గింజ ఏరుకుతింటున్నాయ్!

వేదాంతం యింకా గంభీరంగా మాట్లాడుతూ వస్తున్న నక్కగారి కన్ను అమాంతం కోళ్ళమీద పడింది. వెంటనే చెబుతున్న వేదాంతం చటుక్కున ఆగిపోయింది!

"బావగారూ! క్షమించాలి! నాకీ మిల్లుపక్క కాస్త పనుంది! తప్పకుండా రేపు కల్సుకుందాం! మీకు కనిపించినవారికల్లా, అహింస యొక్క గొప్పతనాన్ని వివరించి చెప్పండి! నేను చెప్పిన సంగతులు మరచిపోకండి!" అంటూ నక్క వెనక్కి దిగబడిపోయింది!

పిల్లికి అయోమయంగా వుంది! అనుమానం కూడ వేసింది! - కొంత దూరం వెళ్ళి, వెనక్కి తిరిగి చూసింది ఓరకంటితో!—

ఏముంది!!!—నక్కయ్యగారు తక్కుతూ, తారుతూ వెళ్ళి, అమాంతం చిన్న కోడిపెట్టమీదికురికి, నోట కరచుకొని, పొలాలకు అడ్డుగావడి పారిపోయింది!

ఇది చూస్తున్న పిల్లి విస్తుపోతూ "ఆఁ...ఇదా సంగతి! ఛీ—ఎంత మోసకారి! అందరికీ నీతులు బోధించి తను చేస్తున్న పనేమిటి! మాటలు చెప్పడం సులువే! కార్యరూపం వచ్చేసరికి జారిపోయింది! అంతా నక్కలాంటి తిక్క శంకరయ్యలే వుంటారా! నేను మట్టుకు అలా చేస్తానా! చస్తే చేయను! అందరికీ అహింసాతత్త్వాన్ని బోధిస్తాను" అనుకుంటూ కాలుముందుకు వేసింది.

ఇంతలో ఎలుక ఒకటి మిల్లులో నుంచి పరుగెత్తుకుంటూ బైటకు వచ్చింది. వెంటనే పిల్లి దృష్టి దాని మీద పడింది!

ఇక ఆలస్యంచేయకుండ, ఆలోచన్లనలా కట్టిపెట్టి అమాంతం దానిమీదికురికి నోట కరచుకొని మిల్లుప్రక్కనుంచి పరుగుతీసింది!

ఇదంతా చూస్తూ మిల్లుగోడ మీద, సాలెగూడులో కూర్చున్న సాలెపురుగు చిత్రంగా తనలో తనే నవ్వుకుంది!

"అయ్యయ్యో! ఎంతటి స్వార్థపరులమ్మా వీళ్లు!— వీళ్ళకు ఏకోశానా జాలి అన్నమాట వుండదు! చూస్తే వీళ్ళకన్నా నేనే ఎన్నో రెట్లు గొప్పగా కన్పిస్తున్నాను. జీవహింస చేయకూడదన్న సంగతి సరిగా అర్థం చేసుకోగలను!" అనుకున్నది.

ఇంతలో ఒక యీగ ఎగురుతూ వచ్చి సాలెగూడులో చిక్కడిపోయింది!

సాలెపురుగు దాన్ని చూసి మెల్లగా లేచి వొళ్ళు బద్ధకంగా విరుచుకొని, "కడుపు మాడినపుడు ఏదో ఒకటి భోంచేయడం తప్పేలా అవుతుంది! అసలు సృష్టికర్తఅయిన దేవుడే జీవహింస చేశాడు. మన మొక లెఖ్ఖా! వేదాంతాల కేమి లెద్దూ! ఎన్నైనా చెప్పవచ్చు? ముందు ఆకలిసంగతి చూసుకోవాలి!" అంటూ సాలెపురుగు యీగను నోట కరచుకొని గూడు చేరుకుంది!

★

పండిత డి గోపాలాచార్యులవారి
అరుణా
గర్భాశయ రోగనివారిణి
ఆయుర్వేదాశ్రమం(ప్రైవేట్)లిమిటెడ్ మద్రాసు-17